ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 13 డిసెంబరు, 2025 | పేజీలు : 08

## రెండవ దశ జిపి ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు



2లో

## ఎన్నికల సామాగ్రి పంపిణీ



### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్** :సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 14వ తేదీ ఆదివారంన జరగనున్న 2వ విడత పోలింగ్ నిర్వహణ కొరకు ఎన్నికల సామాగ్రిని కేటాయించిన ప్రకారం ప్రణాళికాబద్ధంగా పంపిణీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మెదక్ కేంద్రంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూరు శాతం ఓటింగ్ లక్ష్యంగా ప్రజలు ఓటింగ్ లో పాల్గొనాలని తెలిపారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఓటింగ్, కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 13వ తేదీన అధికారులు నిర్దేశిత సమయానికి తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో రిపోర్టు చేయాలని, ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించేం

తరువాయి 2లో

## ఇంజనీరింగ్ పనుల పర్యవేక్షణకు
# ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు

### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :జిల్లాలో ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణను మరింత సులభతరం చేసి పారదర్శకతను పెంచే దిశగా ప్రత్యేక పోర్టల్ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్అండ్‌బి, జాతీయ రహదారులు, పంచాయతి రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖలకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ శాఖలకు ఏ పథకం కింద ఎంత నిధులు కేటాయించబడ్డాయి. ఏ పనులు చేపట్టారు. వాటి పురోగతి ఎంత, పూర్తి చేయాల్సిన గడువు,



ప్రారంభం కాని పనులు, కాంట్రాక్టర్ల సమస్యలు, స్థల సంబంధిత ఇబ్బందులు వంటి అన్ని అంశాలను ఒకే వేదికలో సమగ్రంగా పొందుపరుస్తూ పోర్టల్ రూపొందించామని తెలిపారు. పోర్టల్‌ను పరిశీలించి ఈ ఈలు మూడు రోజుల్లో ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని, ఇచ్చిన సూచనల ఆధారంగా పోర్టల్ కు తుదిరూపం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ పోర్టల్ వల్ల పనుల యొక్క పర్యవేక్షణ సులభతరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఇంజినీరింగ్ శాఖకు ప్రత్యేక ఐడీ కేటాయించి పోర్టల్‌లో లాగిన్ అయ్యే సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సలహాలు, సూచనల ఆధారంగా పోర్టల్‌ను మెరుగుపరిచి తుది వెర్షన్ విడుదల చేస్తామని, అనంతరం అన్ని శాఖల ఇంజినీరింగ్ అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన పనుల వివరాలు, కేటాయించిన నిధులు, పురోగతి వంటి వివరాలను పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్ట ర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్ ఈఈ బసవ ప్రసాద్, తిరుపతి రావు, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, పంచాయతి రా జ్, ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శ్వేతా, జా తీయ రహదారుల డీఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు జల్ ప్రహరీ సమ్మాన్
# పురస్కారం




**ప్రజాపక్షం / జనగామ** :జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌లో కేంద్రం అందించే జల్ ప్రహరీ సమ్మాన్ పురస్కారం లభించింది. గురువారం ఈ అవార్డులను ఆందుకోవాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ అక్కడకు వెళ్లలేదు. భూగర్భ జల సంరక్షణ, నీటి పునరుద్ధరణ, నీటి వనరుల పరిరక్షణ, వినూత్న పద్ధతులు అమలు చేసి భూ గర్భ జలాలు పెంచినందుకు గాను ఈ పురస్కారం లభించింది. రెండు తెలంగాణ రాష్ట్రల్లో జనగామ జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఈ అవార్డు లభించడం అభినందనీయం. భూగర్భ జల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ పురస్కారం అందజేస్తారు. ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో భూ గర్భ జల సంరక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వ్యక్తి జనగామ జిల్లా కలెక్టర్ ఒక్కరే. డిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగన 6వ జల్ ప్రహరీ సమ్మాన్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ అవార్డులు ప్రధానం చేశారు. దేశంలో 33 మందికి ఈ అవార్డులు దక్కగా జనగామ కలెక్టర్‌కు కూడా ఈ పురస్కారం లభించింది. ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ డిల్లీకి వెళ్లి అవార్డు స్వీకరించలేక పోయారు.

## కాల్వపల్లి నుంచి కన్నెపల్లి ప్రత్యామ్నాయ మార్గాలు ఎస్‌పి పరిశీలన

**ప్రజాపక్షం/ములుగు:** మేడారం జాతర సమయంలో భారీ సంఖ్యలో భక్తులు విచ్చేసే నేపథ్యంలో, ఎలాంటి ట్రాఫిక్ జామ్ జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఇవాల మేడారం మహావీర్ పార్కింగ్ నుండి గోనెపల్లి...వెంగళాపూర్, గో నే పల్లి. .కొండపర్తి మార్గం వరకు ట్రాఫిక్‌కు ప్రత్యామ్నా య మార్గాలుగా ఉపయోగించే వీలును పరిశీలించారు. మహావీర్ పార్కింగ్ నుండి గోనేపల్లి..వెంగలాపూర్ రూట్ పై రహదారి వెడల్పు,మలుపులు, సేఫ్ జోన్‌లు, ట్రాఫిక్ డైవర్షన్‌కు అనుకూల ప్రాంతాలను పరిశీలిచారు. అనుకూల పరిస్థితుల్లో గోనేపల్లి..కొండపర్తి రూట్‌ను కూడా ఉపయోగించే అవకాశాన్ని పరిశీలించారు. రోడ్డులో ఉన్న చిన్న చిన్న అడ్డంకులు, చీకటి ప్రాంతాలు, ఎత్తు వంపులను వెంటనే తొలగించేందుకు



సూచనలు చేశారు. మేడారం జాతర సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భక్తుల రద్దీ అధికమయ్యే సమయాల్లో ఈ ప్రత్యామ్నాయ రూట్లను ఉపయోగించి ట్రాఫిక్‌ను సజావుగా నడపాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మార్గమధ్యంలో సైన్ బోర్డ్స్, రేడియ స్టికర్స్, సిగ్నలింగ్ టీమ్స్, పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎస్పి ములుగు రవీందర్, సిఐ ప్రసాద యాకర్, ఎస్ఐలు,పాల్గొన్నారు.

## మొదటివిడుత 'ఎన్నికలకు హాజరుకాని 182 మంది ఉద్యోగులు సస్పెన్షన్ '



**ప్రజాపక్షం/సిద్దిపేట** : సిద్దిపేట జిల్లాలో మొదటి విడుత ఎన్నికలకు హాజరుకాని 182 మంది ఉద్యోగులను సస్పండ్ చేసినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్, మరియు ఎన్నికల అధికారి కె. హైమావతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# తక్షణ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి

**ప్రజాపక్షం / జనగామ** :కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని తక్షణ మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని జనగామ అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం జనగామ మండలంలోని చౌడారం గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంను ఆయన పరిశీలించారు. పాఠశాల భవనాల పరిస్థితి, తరగతి గదులు, హాస్టల్ గదులు, శానిటేషన్ సదుపాయాలు, తాగునీటి వ్యవస్థ, వంటశాల, భద్రతా ఏర్పాట్లు, వద్యార్థుల వసతి సౌకర్యాలపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. కెజిబివి పాఠశాల్లో మౌళిక వసతులు, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా నాన్యత అత్యంత కీలకమన్నారు. అవసరమైన మరమ్మత్తులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని, విద్యార్థులకు సురక్షితమైన, శుభ్రమైన సౌకర్యవంతమైన వాతావరణం ఉండేఆల



చూడాలని ఆదేశించారు. డిసిడిఓ గౌసియాబేగం, సోషల్ వెల్ఫేర్ శాఖ డిఈ, ఈఈ,ఎస్ఓ పాల్గొన్నారు.

**జనగామ పట్టణంలోని జిల్లా పరిషత్ గర్ల్స్ స్కూల్‌ను పరిశీలన** :జనగా పట్టణంలోని జిల్లా పరిషత్ గర్ల్స్ పాఠశాల భవన నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ పరిశీలించారు. పనుల పు రోగతి, నాణ్యత, తరగతి గదుల వ్యవస్థ, భవన భద్రత, మౌళిక వసతులను పరిశీలించి స మీక్షించారు. భవన నిర్మాణంలో ఎ లాంటి లోపాలు ఉండరాదని, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తరువాత భవిత కేంద్రా న్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడ సి బ్బందితో మాట్లాడారు. వికలాంగ పల్లల నైపుణ్యాభివృద్ధి, అభ్యాస వా తావరణ, అందిస్తున్న సేవలు, అవసరమైన మౌళిక వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, కోఆర్డినేటర్, ఎంపిడిఓ, తహాశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లను సందర్శించిన సిఐ

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలో 3వ విడుత జరిగే గ్రామ పంచాయితి ఎన్నికల సందర్భంగా శుక్రవారం పాలకుర్తి సీఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ పవన్‌కుమార్ పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. టర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన సూచించారు.

## 14న నాలుగు మండలాల్లో పోలింగ్

### 85 జీపీలు, 694 వార్డులకు జరగనున్న ఎన్నికలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రెండవ విడత ఎన్నికల ప్రచారం ముగిసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈనెల 14న జరుగనున్న భూపాలపల్లి, ్ధపాలపల్లి, చిట్యాల, పలిమెల మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. 2వ విడతలో చిట్యాల మండలంలో 26 గ్రామ పంచాయతిలు, 218 వార్డులకు, 25 పంచాయతిలకు, 198 వార్డులకు, భూపాలపల్లి మండలంలో 26 గ్రామ పంచాయతీలు, 216 వార్డులకు, అదే విధంగా పలిమెల మండలంలో 8 గ్రామ పంచాయతిలకు 62 వార్డులకు మొత్తం నాలుగు మండలాలలోని 85 గ్రామ పంచాయతీలకు, 694 వార్డులలో 14 న ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో సైతం కాంగ్రెస్ పార్టీ సత్తా చాటే అవకాశం ఉన్నట్లు మొదటి విడతతో తెలిసిపోయింది.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

దుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా సమైక్యగా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ నెల 14వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని, అధికారులు, మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, తహాసిల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంపీడీవో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలభైరవ దేవస్థానంలో భక్తుల కొలహాలం

**ప్రజాపక్షం/హనుమకొండ** : హనుమకొండలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్దులు గుట్టలో స్వయంభుగా వెలసిన కాలభైరవుని దేవస్థానంలో శుక్రవారం కాలభైరవ జయంతి సందర్భంగా భైరవష్టమి ఘనంగా నిర్వహించారు. కాలభైరవ దేవాలయ ప్రధాన పూజారి వినయ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున 3 గంటల నుండి కాలభైరవునికి అభిషేకాలు నిర్వహించి, అనంతరం అర్చనలు, అలంకరణ చేసిన తరువాత భక్తుల దర్శనార్థలు ఏర్పాటు చేశారు. కొండపై కొలువైన కాలభైరవుని దర్శించుకోవడానికి ఓరుగల్లు నగర ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. దేవాలయాన్ని పూర్తిగా బంతిపూలతో అద్భుతంగా అలంకరించడమే కాకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడంతో వేలాది మంది శుక్రవారం కాలభైరవుడ్ని దర్శించుకున్నారు. అనగా అష్టమి, భైరవాష్టమి రోజున కలభైరవ జయంతి రోజున జరిగే ప్రత్యేక యజ్ఞాలు కూడా నిర్వహించడంతో భక్తులు యజ్ఞంలో కూడా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం అక్కడ మహాన్నదానంలో పాల్గొని ప్రసాదాలు కూడా స్వీకరించారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో సిద్దుని గుట్ట మొత్తం భక్తులతో కిటకిటలాడింది. క్యూలైన్లలో రెండు గంటలకు పైగా వేచి ఉండి



కాలభైరవుని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రహదోషాలు, కుజ దోషాలు, ఎలాంటి ఉన్నా కూడా తొలగిపోవాలని భైరవ దీపాన్ని వెలిగించారు. ప్రతి నెల అష్టమి, అమావాస్య పర్వదినాన నిర్వహించే అభిషేక అర్చనలలో ప్రత్యేకంగా భక్తులు పాల్గొని దోషాలు తొలగించుకొని పిల్లలు కుటుంబ సమేతంగా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ముందుకు సాగాలని ఆ దేవున్ని ప్రార్థించారు. కాలభైరవి జయంతి ఉత్సవాలలో పెద్ద ఎత్తున మహిళలు కుటుంబ సమేతంగా వచ్చి దర్శనాలు చేసుకొని పూజల్లో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, 53వ డివిజన్ సోదా కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణం చేయాలి

**ప్రజాపక్షం/ములుగు:** వాహనదారులు వేగాన్ని అదుపు చేసుకొని ప్రయాణం చేయాలని ములుగు ఎస్పి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శీతాకాలం సందర్భంగా ఫాగ్ లైట్లు, హెడ్‌లైట్లు తప్పనిసరిగా ఆన్‌లోనే ఉంచాలని, వాహనాన్ని నెమ్మదిగా నడపాలని, ఓవర్ స్పీడ్ చేయకూడదని, తద్వారా ప్రమాదాలు తగ్గుతాయన్నారు. పొగమంచు కారణంగా వాహనాలు కనిపించకపోవచ్చు కావున ముందు వెళ్తున్న వాహనానికి కనీస సురక్షిత దూరం పాటించాలన్నారు. రోడ్డు పక్కనున్న మార్కింగ్ లైన్స్‌ను దాటకుండా నడపాలని, ఇతర వాహనదారులను అప్రమత్తం చేయడానికి హారన్‌ను ఉపయోగించాలన్నారు. ఇండికేటర్లు సరిగా పనిచేస్తున్నాయో ముందుగా చెక్ చేసుకోవాలని, మూల మలుపుల వద్ద ముందస్తుగానే ఇండికేటర్స్‌ను వాడాలన్నారు. ఎక్కువ పొగమంచు ఉన్నప్పుడు హై బీమ్ ఉపయోగించవద్దని, అది ఎదరు వచ్చే వారికి విజిబిలిటీ తగ్గిస్తుందన్నారు.



టైర్లు, బ్రేకులు, వైపర్లు ముందుగానే చెక్ చేసుకోవాలన్నారు. అవసరం లేకుండా రోడ్డు పక్కన వాహనాలు ఆపవద్దని, ఆపాల్సి వస్తే హెజర్డ్ లైట్లు ఆన్ చేయాలన్నారు. డ్రైవర్లు పూర్తిగా అప్రమత్తముగా ఉండాలని, నిద్రలేమితో గాని తాగిన మత్తులో గాని డ్రైవింగ్ చేయవద్దన్నారు. ఉదయం పూట వాకింగ్ చేసే వాళ్లు హైవేలపై వాకింగ్ చేయరాదని, నిర్ణీత మైదానాలలో మాత్రమే వ్యాయామం చేసుకోవాలన్నారు. వింటర్ ఫాగ్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉదయం 5గంటల నుండి 8గంటల మధ్య రాత్రి 8 తర్వాత ప్రయాణాలు వద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112 నంబర్‌కు వెంటనే ఫిర్యాదు చేయగలరని ఎస్పి తెలిపారు.

## టీం వర్క్‌తోనే మొదటి విడత ఎన్నికలు ప్రశాంతం

### కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్


**ప్రజాపక్షం / జనగామ** :టీం వర్క్‌తోనే మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. రెండు, మూడో విడత ఎన్నికలు సైతం అదే స్పిరిట్‌తో నిర్వయించాలన్నారు. రెండు, మూడో విడత ఎన్నికల నిర్వాహణపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి జిల్లా పరిషత్ సీఈఓ, తహాశీల్దార్లు, ఎంపిడిఓ, ఇతర పోలింగ్ అధకారులతో గూగుల్ మీట్ నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబూషన్ సెంటర్లను సరిగ్గా నిర్వహించాలన, చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్ పంపిణీ జరగాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయలు ఉండాలని, ఓటింగ్‌కి సంబందించొ ఇచ్చే నివేదిఇకలన్ని పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. వార్డు, సర్పంచ్ ఎన్నికలకు సంబందంచ బ్యాలట్ పేపర్ రెండింటని ఓటర్లు బ్యాలట్ బాక్స్‌లో వేయాలని, అలాగే రెండింటి మీద స్వస్తిక్ గుర్తును ఇంక్‌తో పూర్తిగా అంటించాలన్నారు. ఈ అంశంపై అక్కడే ఉండే పోలింగ్ అధికారులుకు ఓటర్లకు తెలియజేయాలన్నారు. పోలింగ్ అయిపోగానే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ జాగ్రత్తగా జరగాలని, వేగవంతంగా జరిపేందుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ ఎన్నక ప్రక్రియ కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్‌లో తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

## రెండవ దశ జిపి ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు

**ప్రజాపక్షం/భూపాలపల్లి** :2వ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం నుండి 2వ దశ గ్రామ పంచాయతి ఎన్నికలు నిర్వహణకు 13వ తేదీన పోలింగ్ మెటీరియల్ పంపిణీ, 14వ తేదీన పోలింగ్, ఓట్లు లెక్కింపు తదితర అంశాలపై రెవెన్యూ, మండల ప్రత్యేక అధికారులు, పంచాయతి రాజ్ తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2వ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 10 గంటల వరకు పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పంపిణీ. కేంద్రాల్లో మెటీరియల్ తీసుకున్న సిబ్బంది కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని 14వ తేదీన ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎక్కువ గ్రామ పంచాయతీలు ఉన్న మండలాల్లో గ్రామాల వారిగా 3 భాగాలుగా విభజించి ఇంచార్జీలను నియమించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ లేని చోట మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిపిఓ శ్రీలత, డీఈఓ రాజేందర్, మహిళా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, ఆర్డిఓ రవి, అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసిల్దారులు, ఎంపీఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ ఉన్నత పాఠశాలకు అరుదైన గౌనవం

### తెలంగాణ టాప్ 20 స్టేట్ బోర్డ్ స్కూల్స్‌లో స్థానం



**ప్రజాపక్షం/కాటారం:** మండలకేంద్రంలోని ఆదర్శ హై స్కూల్ మరో అరుదైన ప్రతిష్టను సాదించింది.తెలంగాణ రాష్ట్రంలోని ఎంపికైన టాప్ 20 స్టేట్స్ బోర్డ్ సూల్స్‌లో ఆదర్శ హైస్కూల్ స్థానం సాధించి స్కూల్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది.బెస్ట్ అకాడమిక్ ఎక్స్‌లెన్స్ స్కూల్స్, ఎక్స్‌లెన్స్ ఇన్‌లైఫ్ స్కిల్స్ ఎండ్యుకేషన్, ఎక్సలెన్స్ ఇన్ ఇన్స్పిరేషనల్ లీడర్ షిప్ వంటి మూడు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చూపినందుకు గుర్తింపు లభించింది.హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం బ్రేస్‌ఫీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈటి టెక్ ఎక్స్ కాన్ఫరెన్స్‌లో ప్రముఖుల చేతుల మీదుగా ఆదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో గత 36 సంవత్సరాలుగా విలువలతో కూడిన విద్యనందిస్తూ ఆధునిక బోధనా విధానాలు 21వ శతాబ్ద నైపుణ్యాలు,విద్యపరంగా పూర్తి అభివృద్ధిపై దృష్టి పెట్టడం వల్ల ఇలాంటి గౌరవం లభించిందని అన్నారు.. భవిశ్యత్తులో మరింత నాణ్యమైన విద్యతో ప్రతీ విద్యార్థిని గ్లోబల్ లీడర్ గా తీరిర్చిదిద్దడం తమ లక్ష్యమని అన్నారు.ఆదర్శ విద్యాసంస్థకు లభించిన ఈ గౌరవంపై చైర్మెన్ జనగామ కరుణాకర్ రావు ప్రిన్సిపల్ జనగామ కృషిత,విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు

**ప్రజాపక్షం/రేగొండ:**గోరుకొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వరపల్లి కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న పున్నం రాజు గురు వారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆరవ వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందాడు. శుక్రవారం కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న రాజు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టిఆర్ఎస్ గ్రామ కమిటీఅధ్యక్షుడు బానోతు రావణ్ నాయక్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరి ఉపసర్పంచ్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. సందర్భంగా రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు నచ్చకపోవడంతో బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల రమేష్, బండారు స్రవంతి, గట్టు అనూష, పనస రాంబాబు, దేవేందర్, సురేష్, విజేందర్, శ్రీకాంత్ నవీన్ వెంకన్న రాజకుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దత్త క్షేత్రంలో ప్రధాన అనగాష్టమి వ్రతాలు

### హాజరైన ప్రముఖులు అధికారులు వ్యాపారులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** అష్టసిద్దులతో కూడిన అనగాష్టమి వ్రతం ఆచరించుకుంటే.. ఐశ్వర్యం.. ఆరోగ్యం అన్ని సిద్దిస్తాయని అవధూత దత్త పీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రధాన అనగాష్టమిని పురస్కరించుకొని మార్గశిర బహుళ అష్టమి శుక్రవారం వరంగల్ నగరంలోని ములుగు రోడ్డు ప్రాంతంలో గల శ్రీ గణపతి సచ్చిందానంద వరద దత్త క్షేత్రంలో ప్రధాన అనగాష్టమి వ్రతంలు నేత్రపర్వంగా జరిగాయి. 1000 మందితో సామూహికంగా కొనసాగిన అనగాష్టమి వ్రతంను దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులతో కిటకిటలాడిన దత్త క్షేత్రంలో అనగాష్టమి వ్రతంను భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. వ్రతం అనంతరం నైవేద్య నివేదిన మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం వితరణ అనంతరం 3వేల మంది భక్తులకు అన్న ప్రసాదం వితరణ జరిగింది. పెద్దయెత్తున జరిగిన ఈ వ్రతాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు, డాక్టర్ కంటేమ్ లక్ష్మి నారాయణ, చేకిలం ఏకంబరం కేతిరెడ్డి, విజేందర్‌రెడ్డి, నిమ్మల యుగంధర్, తోట శివ కుమార్, జూలూరి శ్రీనివాస్ రావు, వడ్డే రవీందర్, డాక్టర్ వద్దిరాజ్ శర్వాణి, వడిచర్ల శ్రీనివాస్, మెడిశెట్టి కుమారస్వామి, కర్రు ఓం ప్రకాష్‌తో పాటు దద్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్, దత్త పీఠం వేద పండితులు ఆలయ అర్చకులు రాపాక గోపికృష్ణ శర్మ, ఏసిపి సత్యనారాయణ, పాల్గొన్నారు.

## అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన



**ప్రజాపక్షం/నెక్కొండ:** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా సాగాలనే లక్ష్యంతో నెక్కొండ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన ఎన్నికల అధికారి, ఎంపిడిఓ యాసం లావణ్య మాట్లాడుతూ అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఖర్చుల వివరాలను సమయానికి, నిజాయితీగా ఎన్నికల అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటిండెంట్ దయాకర్, ఎన్నికల ఖర్చుల నిర్వహణ అధికారి శాంతి కిరణ్, ఇతర అధికారులు, సర్పంచ్‌గా వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు లక్ష్యం

ప్రజాపక్షం/నెక్కొండ:సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి నేడు నెక్కొండ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారం నిర్వహించనున్నారు. పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి దీక్షకుంట్ల, సీతారాంపురం, ముదిగొండ, వాగ్యానాయక్ తండా, బంజరపల్లి, గొల్లపల్లి, చంద్రుగొండ, పత్తిపాక, సాయిరెడ్డిపల్లి, గొట్లకొండ, బొల్లికొండ, అలంకానిపేట, తోపనపల్లి, వెంకటాపురం, అప్పలరావుపేట, గుండ్రపల్లి, మడిపెల్లి, పెద్దకొర్పోల్, నాగారం, సూరిపెల్లి, ప్రచార కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త, నాయకులు సమన్వయంతో నిర్వహించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ పిలుపునిచ్చారు.

## వాహనాల సీజ్

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** 103 పెండింగ్ చలాన్ లు ఉన్న వాహనాన్ని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు సిజ్ చేసారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో ఎస్సై కనక చంద్రం, ఎస్సై సంపత్ ఆధ్వర్యంలో కాజీపేట చర్చి వద్ద వెహికల్ చెక్ చేశారు. బైక్ పై 103 పెండింగ్ చలాన్ ఉన్న వాహనాన్ని గుర్తించారు. 25105 రూపాయల ఫైన్ ఉండగా వెహికల్‌నిసీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ప్రముఖ వ్యాపారవేత్త చెంచారావు కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బండారుపల్లి చెంచారావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. స్థానిక ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమం రాజకీయ వర్గాల్లో విశేష చర్చనీయాంశంగా మారింది. సాయిరెడ్డిపల్లి, పత్తిపాక, నెక్కొండ, పట్టణంతో పాటు మండలంలోని అనేక గ్రామాల్లో వ్యాపార రంగంలో చెంచారావు విశ్వాసాన్ని సంపాదించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజలతో అనుబంధం, సేవాభావం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుదనం ఆయనకు మంచి ప్రజాదరణను తీసుకొచ్చాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం మూడు కీలక గ్రామాల్లో చెంచారావు ప్రభావం కాంగ్రెస్ పార్టీ కి బలానిస్తుందని, అంతేకాక వైతరణి గ్రామాల్లో కూడా ఆయన ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని చెబుతున్నారు. ముందుస్తు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆయన చేరిక పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. కాంగ్రెస్ వర్గాలు కూడా చెంచారావు చేరికను స్వాగతిస్తూ వరంగల్..నెక్కొండలో పార్టీకి ఇది బలం, ప్రజల్లో ఉన్న మంచి పేరుతో చెంచారావు కాంగ్రెస్‌కు మరింత చేరువ అవుతారని అభిప్రాయపడుతున్నాయి. నెక్కొండ కాంగ్రెస్ రాజకీయాల్లో ఈ చేరిక కొత్త సమీకరణలకు దారి తీస్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ,కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య,కార్య నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ వలబోజు మోహన్ రావు,కన్వీనర్ పొన్నె కంటి శ్రీనివాసాచారి, కోఆర్డినేటర్ డాక్టర్ వేముల తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం,నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, స్పోర్ట్స్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, యూత్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, ఉమెన్ ఇండియన్ ఐకాన్ పురస్కారం,భారత స్ఫూర్తికిరిటీ పురస్కారం, నటరాజ పురస్కారం, మహానంది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్స్, ఈవెంట్ మేనేజర్స్, డాన్స్ మాస్టర్లు, యాంకర్లు, సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పి, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, ఒగ్గు కథ, బుర్రకథ, రంగస్థలం కళాకారులు, వాస్తు, జ్యోతిష్యం, భక్తి, పురోహితం, యోగా, క్రీడా, సామాజిక సేవా, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ,సైన్స్ అండ్ టెక్నాలజీ, డోలక్, హార్మోనియం,భజన కళారంగం,వ్యవసాయం, కరాటే,మ్యాజిక్, దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 31 వరకు పంపాలన్నారు. పురస్కారాల ప్రదానోత్స వ కార్యక్రమం జనవరి 25న వరంగల్ నగరంలో ని ర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9100174351, 9494400158 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా చైతన్య పరచడం ద్వారా వారికి వైద్య పరమైన ఖర్చును తగ్గించవచ్చునని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది ఎం.కవిత పేర్కొన్నారు.శుక్రవారం యూనివర్సల్ హెల్త్ కవరేజ్ డే సందర్భంగా హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ హైదర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గౌరవ చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు తెలియజేసేలా, అలాగే డాక్టర్లు, సిబ్బంది అందిస్తున్న సేవలను వారు సద్వినియోగం చేసుకొని వైద్య పరంగా తమకయ్యే ఖర్చు తగ్గించుకునేలా అవగాహన కలిగించడంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు పారా లీగల్ వాలంటీర్లు కూడా కృషి చేయడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ పరంగా అందిస్తున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ సేవలు, ఉచితంగా అందించే డయాగ్నొస్టిక్ సేవలు,మందులు, వైద్య సలహాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒత్తిడిని అధిగమించడం అలాగే మంచి ఆహారపు అలవాట్ల ద్వారా జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చునన్నారు. వైద్యాధికారి డాక్టర్ హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్ రెడ్డి 33 జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా అందిస్తున్న సేవలు, ఆయుష్మాన్ భారత్,ఎన్సీడీ, టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఆరోగ్యశ్రీ, తదితర అంశాలను హాజరైన ప్రజలకు వివరించారు. ఈ బాబు,మరియా థామస్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్,ఏఎన్‌ఎంలు ఆశాలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సర్పంచ్‌గా ఆదరిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

### కామారం సర్పంచ్ అభ్యర్థి తోట లక్ష్మీ కుమార్



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** కామారం గ్రామ సర్పంచిగా నన్ను ఆదరించండి, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని బిఆర్‌ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తోట లక్ష్మి కుమార్ ప్రజలను అభ్యర్థిస్తూ గ్రామంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. తన గుర్తు ఉంగరం పై ప్రజలు అమూల్యమైన ఓటు వేసి దీవించండి అంటూ గడప గడపకు ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు విన్నపం చేసుకుంటూ తాను తెలంగాణ సాధనలో అన్ని రకాల ఉద్యమాలలో పాల్గొని తెలంగాణ సాధనలో తన వంతు కృషి చేశానని అన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అండదండలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో అంతర్గత సిసి రోడ్లు మంచినీటి వసతి కల్పించుటలో నా వంతు కృషి చేశానని, అదేవిధంగా పిఎసిఎస్ పెంచికలపేట సొసైటీలో డైరెక్టర్గా పని చేస్తూ రైతులకు రుణమాఫీలో, రుణాలు ఇప్పించుటలో, వరి ధాన్యం అమ్మకాలలో కృషి చేశానని ప్రజలకు తెలుపుతూ తనను సర్పంచ్‌గా తన గుర్తు ఉంగరం పై ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు. తాను చేసినటువంటి అభివృద్ధి పనులను చూసి ఓటు వేయాలని, ముందు ముందు ప్రజలకు అందుబాటులో ఉండి ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే టిఆర్‌ఎస్ వార్డు అభ్యర్థులను కూడా భారీ మెజార్టీతో గెలిపించగలరని ఆయన కోరారు.

## 14న షైన్ స్కాలర్షిప్ టెస్ట్

### కళాశాలల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బాలసముద్రం, హన్మకొండ నందు షైన్ జూనియర్ కళాశాలలో 14న ఆదివారం ఉదయం 10 00 నుండి ఉదయం 1130 గంటలకు షైన్ స్కాలర్షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాలల ఛైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తెలియజేశారు. ఈ సందర్భంగా మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ షైన్ కళాశాలల ప్రారంభం నుండే ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఐ.ఐ.టి, నీట్ వంటి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు అందిస్తూ రాష్ట్రంలోనే అగ్రగామి విద్యాసంస్థగా పేరొందిందని, తెలుపుతూ రాబోవు విద్యాసంవత్సరమునకు గాను 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ షైన్ కళాశాలలు నిర్వహించబోవు స్కాలర్ షిప్ టెస్ట్‌లో పాల్గొని, వారి ప్రతిభను చూపించి, ఇంటర్ కాలేజి ఫీజులో రాయితీ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమములో కళాశాలల డైరెక్టర్లు ముగుల రమ, ఎ. కవిత, మూగుల రమేష్ యాదవ్, ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి. శ్రీనివాస్, ప్రశాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న సర్పంచ్ అభ్యర్థి దేవేందర్



**ప్రజాపక్షం/ఖానాపూర్:**స్థానిక ఎన్నికలలో భాగంగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్పంచ్ వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ఈ రోజు ఖానాపురం మండల కేంద్రంలో యాప చెట్టు తండా గ్రామ పంచాయతీ ప్రచారంలో భాగంగా వివిధ వార్డులో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థి దేవేందర్ మూడు కత్తెర గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. యాప చెట్టు తండా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తల మద్దతుదారులతో కలిసి తండాలో తిరుగుతూ ఓటర్ మహాశయులకు తనకు పూర్తి మద్దతు తెలుపాల్సిందిగా ప్రతి ఒక్క ఓటరు కోరుకున్నాడు. సర్పంచ్‌గా తనకు, వార్డు మెంబర్‌లందరికి ఓటర్లు పూర్తి మద్దతు తెలుపుతూ గెలిపించాలని కోరారు. ప్రచారం కార్యక్రమం సీనియర్ నాయకులు గుగులోతు, ఇస్లావత్ వాగ్య, గుగులోతు సతీష్, గుగులోతు బద్రు, మూడు కేథియా, వెంకన్న, రమేష్, దేవిసింగ్, దేవు పవన్ కళ్యాణి గాయని, మమత, వినోద, జీవన్, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, పెద్దయెత్తున పాల్గొన్నారు.

## బస్వారాజుపల్లి బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సస్పెండ్

**ప్రజాపక్షం/గణపురం :** గణపుర మండలంలోని బసవరాజు పల్లి బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చౌదరి రాజయ్య ను మరియు వార్డ్ మేంబర్ చౌదరి స్వప్నను పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందున మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గారి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోతే కరుణాకర్ రెడ్డి వారిని బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, మాజీ సర్పంచ్ చెరుకు కుమారస్వామి, మార్త శ్రీనివాస్, మార్త సుధాకర్, దాసరి రాములు, భీష్మాచారి రత్నం రాజు, గట్టు రమేష్,అజ్మీరా రాజు, మధు, కవిత, పూర్ణ చందర్, అంబటి సురేష్, చింటూ నాయక్, గణేష్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటా

**ప్రజాపక్షం/గణపురం :** ఓటమి చెందిన ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాజీ జెడ్పిటిసి మోటపోతుల శివ శంకర్ గౌడ్. అన్నారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ నాకు 2235 వందల ఓట్లు వేసి గెలుపు వరకు తీసుకువెళ్లిన ఓటర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క మొగిలి, మామిండ్ల మల్లేష్, మాదాసు రవి, మార్క కుమార్, షరీఫ్, సాయి, తాళ్లపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిలపై దృష్టి పెట్టండి : డిఇ

**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** విద్యుత్ బకాయిలపై దృష్టి పెట్టాలని ఆపరేషన్ డీఈ బి సారయ్య అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ ఏఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సిబ్బందితో డీఈ బి సారయ్య విద్యుత్ సరఫరాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడుత పంచాయితి ఎన్నికల సందర్భంగా డివిజన్ పరిధిలో రెప్పపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా కష్టపడ్డ విద్యుత్ సిబ్బంది, అధికారులను ఆయన అభినందించారు. విద్యుత్ వినియోగదారులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సిబ్బందికి సహకరించాలన్నారు. బకాయిలు లేకుండా కరెంట్ బిల్లులు సక్రమంగా చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏ కె విశ్వసాహితి, సబ్ ఇంజనీర్ వరుణ్, జావీద్, లైన్ ఇన్స్‌పెక్టర్ ఆనంద్, లక్ష్మారెడ్డి, కుమారస్వామి, ప్రభాకర్, కుమార్, రంజిత్, అనిల్ పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి గ్రామసర్పంచ్‌గా కాలేరు శ్రావణ్ ఎన్నిక

ప్రజాపక్షం/వేలేరు : వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో మొదటి విడుత ఎన్నికల ఫలితాలు గురువారం సాయంత్రం విడుదల కాగా కాంగ్రేస్ పార్టీకి చెందిన కాలేరు శ్రావణ్ తనప్రత్యర్థి బిఆర్ఎస్ పార్టీకి చెందిన అల్లం సతీష్ పై 104 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా ఉపసర్పంచ్‌గా మాలోతు శోభను ఎన్నుకోవడం జరిగింది ఈసంధర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ నాపైనమ్మకముతో గ్రామసర్పంచ్ గెలిపించిన గ్రామస్తులకు రుణపడి గ్రామఅభివృద్ధికోసం అమత్నిషలు కృషిచేస్తానని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం

**ప్రజాపక్షం/రాయపర్తి :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. వరంగల్ జిల్లాలోని అత్యంత పెద్ద మండలంగా పేరు గాంచిన రాయపర్తి మండలంలో 40 గ్రామ పంచాయతీలకు 3 ఇండిపెండెంట్ అభ్యర్తులు, 3 ఏకగ్రీవం, 9 గ్రామ పంచాయతీల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, 25 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.

ఆరే గూడెం సర్పంచ్‌గా బళ్ళకారి యాకయ్య(బిఆర్ఎస్), బంధన్ పల్లి గుగులోత్ అక్రినాయక్(బిఆర్ఎస్), బురహాన్‌పల్లి సూదుల ఉమాదేవి(స్వతంత్ర్య), గన్నారం గడ్డ విజయ(బిఆర్ఎస్), గట్టికల్ చెవ్వ హేమలత(కాంగ్రెస్), జగన్నాధపల్లి బద్దం సుగుణమ్మ (కాంగ్రెస్), కాట్రపల్లి రాపాక పద్మ ఇండిపెండెంట్, కేశవపురం గుజె సుధాకర్ (కాంగ్రెస్), కిష్టాపురం కొండం రంగారెడ్డి ఏకగ్రీవం, కోలనుపల్లి వంగాల ఎల్లమ్మ (కాంగ్రెస్), కొండాపురం కనుకుంట్ల మంజుల (కాంగ్రెస్), కొత్తూరు కందికట్ల స్వప్న ఇండిపెండెంట్, మహబూబ్ నగర్ పెండ్లి మహేందర్ రెడ్డి (కాంగ్రెస్), మొరిపిరాల పెద్దగోని నాగరాజు ఏకగ్రీవం
మైలారం చిర్ర వేణు (కాంగ్రెస్), ఊకల్ బానోత్ లాలి (కాంగ్రెస్), పెరికేడ్ తీగల సాయిలు (కాంగ్రెస్), పోతిరెడ్డిపల్లి లకావత్ రెడ్డి ఏకగ్రీవం, రాగన్నగూడెం ఆకుల శోభ (కాంగ్రెస్), రాయపర్తి గారే సహేంద్ర ఇండిపెండెంట్, సన్నూరు చినపాక రంజిత్ బిఆర్ఎస్, శివరామపురం శిలా హేమలతరెడ్డి (కాంగ్రెస్), తెట్టేకుంట తండా ఇస్లావత్ సంతోష్ బిఆర్ఎస్, తిర్మలాయపల్లి బరిగేల బాబు బిఆర్ఎస్, వెంకటేశ్వర్లపల్లి సంకినేని సారయ్య (కాంగ్రెస్), ఏకే తండా హలావత్ సోమానాయక్ (కాంగ్రెస్), బాలాజినగర్(టి) మోహన్‌లాల్ ఏకగ్రీవం, బాలునాయక్ తండా భూక్య శ్రీదేవి ఏకగ్రీవం, దుబ్బతండా దేదావత్ గోపాల్ (కాంగ్రెస్), ఎర్రగుంట తండా గుగులోత్ బుజ్జమ్మ బిఆర్ఎస్, గణేష్‌కుంట తండా మునావత్ రఘు (కాంగ్రెస్), జేతురాంతండా గుగులోత్ స్వప్న విజయ్ (కాంగ్రెస్), జయరాంతండా(కే) లావుడ్య శిల్ప బిఆర్ఎస్, జయరాంతండా(ఎస్) గుగులోత్ రమేష్ బిఆర్ఎస్, జింకురాంతండా గుగులోత్ సునీత (కాంగ్రెస్), పానిష్ తండ భూక్య భూల (కాంగ్రెస్), పన్యానాయక్ తండా నునావత్ ఇరానీ (కాంగ్రెస్), సూర్యతండ మునావత్ బానిషా ఏకగ్రీవం, వాంకుడోత్ తండా వాంకుడోత్ దేవేందర్ (కాంగ్రెస్)లు గెలిచారు.

## ఇండిపెండెంట్ అభ్యర్థులుగా తండ్రీ కొడుకుల ఘన విజయం

### ముువ్వ రామారావు మువ్వ భాను

**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** పార్టీ గుర్తులు లేకుండానే కేవలం ప్రజల నమ్మకం సేవాభావం కష్టపాటు అనే మూడు ఆయుధాలతో ముందుకు సాగితే విజయాన్ని ఎవరు అపలేరని మరోసారి నిరూపించారు వివరాల్లోకి వేలితే పస్రా గ్రామానికి చెందిన ముువ్వరామారావు ముువ్వభాను తండ్రి కొడుకులు వార్డు నెంబర్లుగా 3వ వార్డు రామారావుగా 11వ వార్డు భానుగా ఏ పార్టీతో సంబందం లేకుండా స్వతంత్ర అభ్యర్థులుగా పోటి చేసిన ఈ ఇద్దరూ ప్రజల ఆశీర్వాదాలతో ఘన విజయం సాధించారు పార్టీ ఆశ్రయం లేకపోయన ప్రజల మధ్య గడిపిన సంవత్సరాల సేవ అందరికి అందుబాటలో ఉండటం సమస్యల పరిష్కారంలో ముందుండటం వీరి బలాలు అయ్యాయి ఏ పార్టీకి మద్దతూ లేకుండా ప్రజల కోసం ప్రజలతోనే అనే సూత్రాన్ని అవలంబించిన వీరికి ప్రజలు గొప్ప మద్దతు ఇచ్చారు ప్రచారం సమయంలో తండ్రి కొడుకులు ఒక్కొక్క ఇంటికి వెళ్లి ప్రజల మనసుల గెలుచుకున్నారు ప్రజలకు అందుబాటులో ఉండే స్థానిక నాయకత్వం కావాలన్న కోరిక వారిలో ఉన్న నిజాయితీ ప్రజలను మెప్పించింది ఫలితంగా అన్ని అంచనాలను తలకిందులు చేస్తూ వీరు తమ తమ వార్డుల్లో భారీ మెజారిటిలతో గెలుపొందారు తండ్రి కొడుకుల విజయం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది ప్రజలే శక్తి ప్రజలే నిర్ణయం అని మరొకసారి వారు నిరూపించారు భవిష్యత్తులో ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తామని విశ్వాసానికి తగిన విధంగా సేవ చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.మల్లిఖార్జునరావు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె మల్లిఖార్జునరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మల్లికార్జునరావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా రిజిస్టర్ నిర్వహణ, ఓపీ సేవలు, లాజిస్టిక్ లభ్యత, స్కీనింగ్, ఏఎంసీ నిర్వహణ, రోగ నిరోధక టీకా సేవలు, సిబ్బంది సమయ పాలన, జాతీయ ఆరోగ్య సేవ కార్యక్రమాలపై సబ్ సెంబర్ల వారీగా సమగ్రంగా ఆయన పరిశీలించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీల సంఖ్య పెరిగే విధంగా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డా. స్రవంతి, సీహెచ్‌వో రామ్ కిషన్, సూపర్‌వైజర్ సృజన, సంజన, స్టాఫ్ నర్స్ సునీత, హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్‌రెడ్డి, పాండరి,సంధ్య, స్టాఫ్ నర్స్ సబిత, తదితరులు పాల్గొన్నారు.

## 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

### జారీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ టౌన్ :** గురువారం జరిగిన మొదటి విడత ఎన్నికల విధులకు గైర్హాజరైన 71 మంది అంగన్వాడి, ఎస్‌జీటీ, ఇతర ఉపాధ్యాయులు, అధికారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల విధులు చాలా కీలకమని, వీటికి హాజరుకాని 71 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇస్తూ, రెండవ విడుత ఎన్నికల విధులను కెటాయించిన సంబంధిత ఎంపీడీవో దగ్గరికి వెళ్లి రిపోర్ట్ చేయడంతోపాటు సంజాయిషీ రిపోర్టుని ఎంపీడీవో ద్వారా తమకు పంపించాలని ఆదేశించారు.

## గర్ల్స్‌స్కూల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన జేసి పింకేష్‌కుమార్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలోని కోర్టు సమీపంలో నిర్మాణంలో ఉన్న జెడ్పీ గర్ల్స్ స్కూల్ కొత్త భవనం పనులను, భవిత కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. భవన నిర్మాణంలో ఏ లోపాలు చోటు చేసుకోకుండా నిర్ణీత కాలవ్యవధిలో పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జేసి మాట్లాడుతూ పాఠశాల నిర్మాణాలు విద్యార్థుల భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలని, నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, అదే విధంగా భవిత కేంద్రాలలో పిల్లలకు అందించే సేవలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ పరిశీలనలో ఎంఈవో, కో ఆర్డినేటర్, ఎంపీడీవో, తహశిల్దార్, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం బస్తాలు దగ్ధం

**ప్రజాపక్షం/గణపురం :** మండల కేంద్రం లోని గణప సముద్రం సరస్సు ఊట కాలువ ఆయకట్టు శివారు నిమ్మకాయల పంపులో శుక్రవారం దాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి బాధిత రైతు బండి కుమారస్వామి గౌడ్ కథనం మేరకు సుమారు రెండు ఎకరాల్లో 15 రోజుల క్రితం బిపిటి వరి కోసి అక్కడే ఆరపోసి ధాన్యం బస్తాలలో నింపి నిలువ చేసినట్లు ఆయన తెలిపారు. పంట పొలాలు మొత్తం బురద మయంగా ఉండడంతో రహదారి సరిగా లేకపోవడంతో దాన్ని బస్తాలు అక్కడే ఉండగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో సమీపంలోని పంట పొలాల్లో వరిగడ్డి ని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేయగా మంటలు వ్యాపించి ధాన్యం బస్తాలు దగ్ధమైనట్లు రైతు రోధిస్తూ తెలిపారు. తమకు ఇంట్లో అవసరం కోసం బిపిటి ధాన్యం పండించడం జరిగిందని పంట పొలంలో నిల్వచేసిన ధాన్యం బస్తాలు దగ్ధం కావడంతో తమకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. దగ్ధమైన ధాన్యం బస్తాలను పలువురు ప్రజా ప్రతినిధులు పరిశీలించారు.

## గణపురం మేజర్ గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్‌గా కట్కూరి రాధిక శ్రీనివాస్



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం గ్రామ ప్రజలకు, భూపాల్ పల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో గణపురం గ్రామ అభివృద్ధిలో, భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికలలో నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన గణపురం గ్రామ అక్కా చెల్లెళ్లకు అన్నదమ్ములకు, యువకులకు,కాంగ్రెస్ పార్టీ నాయకులకు కుటుంబ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన సర్పంచ్‌లను సన్మానించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** తొలి దశ గ్రామ పంచాయితి ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన మల్లంపల్లి తాళ్లపల్లి పుష్ప, గిద్దబండ తండా గుగులోతు కాంతమ్మ, మరికొంత మంది కాంగ్రెస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు అంతా కలిసి శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబును మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను శాలువాతో ఆయన ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన కర్కపల్లి నూతన సర్పంచ్ లక్ష్మి

**ప్రజాపక్షం/ఘనపూర్ :** భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సత్యనారాయణ రావు ను కలిసిన కర్కపల్లి సర్పంచ్ అంబాల లక్ష్మి సాంబయ్యలు ఈనెల 11వ తేదీన జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గా కర్కపల్లి గ్రామానికి చెందిన అంబాల లక్ష్మి సాంబయ్య గెలపొందరు వారిని ఎమ్మెల్యే శాలువా తో సత్కరించారు. వారి వెంట ఉప సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ నగేష్, సాయిని నాగేశ్వరావు రామారావు, లింగయ్య తో పాటు నాయకులు, కార్యకర్తలు పాలొగొన్నారు.



## మంత్రిని కలిసిన పెద్ద తాండ సర్పంచ్

**ప్రజాపక్షం/రేగోడ్ :** మెదక్ జిల్లా లో రేగోడ్ మండలం లో గ్రామ పంచాయతీ ఎన్నికలో పెద్దతాండ సర్పంచ్ గా ఎంపికైన సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను శుక్రవారం సర్పంచ్ సంగ్యానాయక్ వార్డు సభ్యులు లో సంగారెడ్డిలో కలిశారు ఈ సందర్భంగా సంగ్యనాయక్ మాట్లాడుతూ పెద్దతాండ గ్రామ పంచాయతీ అన్ని విధాలగా అభివృద్ధి చేస్తామని మంత్రి సహకారంతో ఆదర్శ గ్రామంగా తండాను అభివృద్ధి చేస్తామని అన్నారు.

## అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/వెల్దుర్తి :** ఎన్నికల వ్యాయ పరిశీలకులు రాజ్ కిరణ్ శుక్రవారం రోజు వెల్దుర్తి రైతు వేదికలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుపై అవగాహన కల్పించారు. ఎన్నికల సందర్భంగా చేసే ప్రతి ఖర్చును రాసి పెట్టుకోవాలని ఎన్నికల అయిన తర్వాత 45 రోజుల్లోగా ఖర్చుల నివేదికను సమర్పించవలసి ఉంటుందని లేనిపక్షంలో గెలుపొందిన వారి పదవి రద్దు చేయడం జరుగుతుందని ఎన్నికల వ్యాయపరశీలకులు రాజ్ కిరణ్ అభ్యర్థులకు సూచించారు. ఎన్నికలకు సందర్భంగా ఓటర్లను మభ్యపెట్టడం డబ్బులు మద్యం పంపిణీ చేయడం నేరమని వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంఆర్ఐ నర్సింగ్ యాదవ్, ఎంఈఓ సీతారాం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి చేస్తా...

### సర్పంచ్ అభ్యర్థి ఉమా సంజీవరెడ్డి

**ప్రజాపక్షం/రామాయంపేట :** ప్రజలు ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని ఆర్.వెంకటాపూర్ గ్రామ సర్పంచు అభ్యర్థి ఉమా సంజీవరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు శుక్రవారం మండలంలోని ఆర్.వెంకటాపూర్‌లో బారీ ర్యాలీ చేపట్టారు. మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉమా సంజీవరెడ్డికి మద్దతు పలికారు. బారీ ర్యాలీతో ఇంటింటా తిరుగుతూ లేడిపర్సు గుర్తుకు ఓటు వేసి బారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## పతి గెలుపుకోసం సతి పోరాటం

**ప్రజాపక్షం/రామాయంపేట :** ఓవైపు పతి మరోవైపు కుమారుడు ఎన్నికల పోటీలో ఉన్నారు. కుమారుడిని పక్కన పెట్టి పతి గెలుపుకోసం పోరాడుతున్నారు. మండలంలోని జాన్సీలింగాపూర్ గ్రామంలో పంచాయతి ఎన్నికల్లో తండ్రి మానెగల్ల రామకిష్టయ్య, కొడుకు మానెగల్ల వెంకటి పోటీలో ఉండడంతో రామకిష్టయ్య బార్య అనసూయ భర్తకే మద్దతు పలికి గ్రామంలో ప్రచారంలో పాల్గొన్నారు. చివరి రోజు శుక్రవారం రామకిష్టయ్య బారీ ఎత్తున ర్యాలీ చేపట్టి ఇంటింటా ప్రచారం చేపట్టారు. మరొకసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేస్తానని, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో గ్రామ సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.

### అసైన్డ్ భూములను స్వాహా చేసిన

# అక్రమార్కులను బయటపెడుతాం

**ప్రజాపక్షం/శివ్వంపేట:** సికింద్లాపూర్‌లో గత భూకబ్జాదారుల పని పడుతామని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సికింద్లాపూర్ కాంగ్రెస్ పార్టీ బలపరిచినఅభ్యర్థి దొంతిరెడ్డి అరుణరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారానికి హాజరయ్యారు. అనంతరం పిట్టలవాడలో గ్రామస్థులు ఎదురుకుంటున్న సమస్యలను ఆయనఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సికింద్లాపూర్ దేవాలయ భూములు, పిట్టలవాడ భూములు, ప్రభుత్వ భూములను గతసర్పంచ్‌లు, ఎంపీటీసీలు దోచుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నికార్సైన అరుణమ్మను గెలిపిస్తే పిట్టలవాడలో ఉన్న మంచినీటి సమస్య, కరెంట్‌సమస్యను తీర్చడమే కాకుండా దేవాలయ భూములు, అసైన్డ్ భూములను స్వాహా చేసిన అక్రమార్కుల బాగోతాలను బయటపెడుతామని అందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

### మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మెదక్ జిల్లా నిజాంపేట మండలం నస్కల్ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పాగాల రజిత నగేష్ యాదవ్ కు కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తోగెలిపించాలని మెదక్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి మోసాలను ఎండగట్టాలంటే బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీ ల అమలులో తీవ్ర జాప్యం జరుగుతుందని మండిపడ్డారు. కొత్త పెన్షన్లు, మహిళలకు పట్టుచీరలు,. ఆడపిల్లలకు స్కూటీ, ఇస్తామని ఇవ్వలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 2500 రూపాయలు ఇస్తామని చెప్పి 24 నెలలు గడిచిన ఇప్పటికి ఇవ్వలేదన్నారు ఈ లెక్కన ప్రతి ఒక్క మహిళకు 24 నెలల కాలంలో 60 వేల రూపాయలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఒక్క మహిళకు బాకీ ఉన్నాడనీ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల లోసర్పంచ్ స్థానాలు గెలిచి బీఆర్ఎస్ పార్టీకి బలం చేకూర్చాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదే.చంద్రం,వైస్ చైర్మన్ సులోచన వెంకటస్వామి, నాయకులు భాస్కరరావు, బాల్ రెడ్డి, వెంకట్ గౌడ్, బాల్ రెడ్డి, విజయ్, సంతోష్ రెడ్డి, మోహన్ రెడ్డి, దుబ్బయ్య, స్వామి, మల్లేశం, దేవరాజు, గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



## గ్రామాలలో సర్పంచ్ పదవి ఎంతో కీలకం

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట:** గ్రామాలలో సర్పంచ్‌పదవి ఎంతో కీలకమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చంది, దంతాన్‌పల్లి, భీమ్లతండా, ఉసిరికపల్లి, సీతారాంతండా, ఏదుల్లాపూర్, అల్లీపూర్ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుల గెలుపుకోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కేసీఆర్ హాయంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తే, కాంగ్రెస్ మాత్రం అమలుకాని ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. గ్రామాలను మరింతఅభివృద్ధి చేసుకోవాలంటే గులాబి పార్టీ బలపరిచిన గైనిబైటి ప్రవీణ్‌గౌడ్, దుర్గం భవానిశివకుమార్, సరితనరేశ్‌నాయక్, మర్రి సుజాతకృష్ణారెడ్డి, కల్లూరి హనుమంతరావును, పిట్లశ్రీనివాస్‌ను భారీ మెజారిటితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెవెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, మాజీఎంపీపీ కల్లూరిహరికృష్ణ, తూము కృష్ణారావు, మొలుగు నాగేశ్వర్‌రావు, మర్రిసత్తిరెడ్డి, మర్రి మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుర్గేశ్, బీసీసెల్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ హవా, ఉనికిని చాటిన బిఆర్ఎస్

**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** పంచాయతీ ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ పార్టీ హవా నడిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి విడత లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మండలంలో 16 పంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ 12 స్థానాలలో గెలుపొందింది.

ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ నాలుగు స్థానాలలో ఉనికిని చాటుకుంది. అల్లాదుర్గం మేజర్ గ్రామపంచాయతీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి మద్దూరి సౌమ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కర్రోళ్ల స్వరూప పై 421 పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు.

రెడ్డిపల్లి సర్పంచ్ గా నర్సారెడ్డి 57 ఓట్లతో గెలుపొందగా, రాంపూర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపాల్ రెడ్డి, మందాపూర్( కాంగ్రెస్) అభ్యర్థి కోర్పోల్ రమ్య, కాయిదంపల్లి లో వంకిడి రేణుక (కాంగ్రెస్), ముప్పారం వీరబోయిన కవిత (కాంగ్రెస్), వెంకట్రావుపేట్ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్) ఐబి తండా శంకర్ నాయక్ కాంగ్రెస్, గొల్లకుంట తండా మాన్య నాయక్ కాంగ్రెస్, బహిరిన్ దిబ్బ వీరన్న కాంగ్రెస్, చిల్వర్ శశిధర్ రెడ్డి కాంగ్రెస్, సీతానగర్ పల్లే శోభ (బిఆర్ఎస్) ముస్లాపూర్ జ్యోతి, బిఆర్ఎస్ చేవెళ్ల మచ్చేందర్ బిఆర్ఎస్ అప్పాజీపల్లి గంధాలి రవి బిఆర్ఎస్ తమ సమీప ప్రత్యర్థులపై విజయం సాధించారు.

ఆయా గ్రామాలలో గెలుపొందిన సర్పంచ్ వార్డు మెంబర్ అభ్యర్థులు భాజా భజంత్రీలు, టపాసులు కాలుస్తూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

## కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి

### బిజెపి జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

**ప్రజాపక్షం/వేలేరు :** గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి చెందవు కేవలం కేంద్రప్రభుత్వం అందించే నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని హనుమకొండ జిల్లా బిజెపి అధ్యక్షురాలు రావుపద్మ అన్నారు. శుక్రవారం వేలేరు మండల కేంద్రంలో కాయిత హనుమాన్‌రెడ్డి, శాలపల్లిలో కాట్రేవుల రాజుయాదవ్ సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచిన సందర్భంగా ఆయాగ్రామాలలో జరిగే ఎన్నికల ప్రచారానికి హాజరై మాట్లాడారు. కొంత మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు అవగాహన లేమీతో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కేవలం రాష్ట్రప్రభుత్వాలతోనే అభివృద్ధి చెందుతాయని ప్రచారం చేయడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వమే గ్రామాలను అభివృద్ధి చేడంకోసం ప్రత్యేక నిధులను ఏర్పరచి గ్రామాలను అభివృద్ధి చేస్తాయి, కనుక బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి శ్రేణులు కందగట్ల సత్యనారాయణ, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, బొజ్జపెల్లి సుభాష్, మునిగాల పద్మ, రమేష్, సీత దుర్గాప్రసాద్‌రావు, కీర్తి సురేష్, మండల రవి, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మా సర్పంచ్‌లను గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పిలుపు

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట కల్వకుంట గ్రామాలలో శుక్రవారం రోజున మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల పంజా మహేందర్ రంగా రాధా కిషన్ కొరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు గ్రామాలలో మైనాంపల్లి హనుమంతరావుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున తెలంగాణ సంప్రదాయం ప్రకారం బోనాలతో బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిన టిఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుంత్వ ఏర్పడి రెండు సంవత్సరాల లోనే ఉచిత బస్సు ప్రయాణము, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ పథకం, 100 కోట్లతో ఏడుపాయల అభివృద్ధి, 49 కోట 49 కోట్లతో చర్చి అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నిజాంపేట, కల్వకుంట గ్రామంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైపన్యం వల్ల గ్రామాలలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారానీ వారి ఇబ్బందులను, సమస్యలు తీర్చడానికి మా ప్రభుత్వం ఉందని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పంచ మహేందర్ లేడీస్ బ్యాగ్, రంగా రాధా కిషన్ రిమోట్ కంట్రోల్ రంగా రాధా కిషన్ రిమోట్ గుర్తు ల పైన మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గెలిపించిన నాటి నుంచి సిసి రోడ్లు డ్రైనేజీలు దేవాలయాలు దగ్గరుండి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో నిజాంపేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వెంకట్ గౌడ్, పట్టణాధ్యక్షుడు కొమ్మాట బాబు, అమర్సేనారెడ్డి, వై వెంకటేశం వై వెంకటేశం, కొమ్మాట సత్యనారాయణ, చింతల స్వామి, రాజు సెట్, రవీందర్ రెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారిని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎంఎల్ఏ నాయిని రాజేందర్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్, టిజిఎంఎస్ఐడిసి, ఎండి ఫణింద్ర రెడ్డి ఐఏఎస్‌లు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగుల అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# కెటికె ఓసి త్రీలో 56వ వార్షిక కోల్ మైన్ సేఫ్టీ



ప్రజాపక్షం/గణపురం : గణపురం మండలంలోని కెటికె ఓసి త్రీ లో 56వ వార్షిక కోల్ మైన్ సేఫ్టీ ఫోర్ట్‌నైట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. భద్రతా అవగాహన పెంపొందించడం, ప్రమాదాలు నివారించడం, ఎస్‌ఓపి లను కచ్చితంగా అమలు చేయించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జనరల్ మేనేజర్ (సేఫ్టీ) మధుసూదన్ మాట్లాడుతూ సేఫ్టీ విత్ ప్రొడక్షన్ సంస్థ అభివృద్ధికి కీలకం అన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలనీ సూచించారు. జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, ప్రాంతీయ ఉత్పత్తి, భద్రత రెండూ సమానమైన ప్రాధాన్యత కలిగిన అంశాలనీ. సేఫ్టీ ఫోర్ట్‌నైట్ కార్యక్రమాల ద్వారా ఉద్యోగుల్లో భద్రతా చైతన్యం పెరుగుతోందన్నారు. అలాగే జనరల్ మేనేజర్ (క్వాలిటీ) 56వ సేఫ్టీ ఫోర్ట్‌నైట్ కన్వీనర్ జి.వెంకటరమణ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ మరియు కంపెనీ ఉద్యోగులందరూ ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్రాంతాల్లో సాగుతున్న సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ బిక్షమయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ రాంబాబు, ఆపరేషన్స్ మేనేజర్ సంపత్, ఇతర కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. యూనియన్ నాయకులు రమేష్, మధుకర్ రెడ్డి, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## చౌడారంలోని కేజీబీవీని పరిశీలించిన జేసి

ప్రజాపక్షం/జనగామ టౌన్ : మండలంలోని చౌడారం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో మౌళిక వసతులు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యానాణ్యతకు అత్యంత కీలకమన్నారు. అవసరమైన మరమ్మత్తులు నాణ్యతతోపాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు సురక్షితమైన శుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో జీడీ సీడో, డీఈ, ఏఈ, ఎస్‌వో, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక పోరులో కాంగ్రెస్ బిఆర్ఎస్ పోటా పోటీ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్ : జగదేవ్‌పూర్ మండలంలో జరిగిన స్థానిక పోరులో అధికార కాంగ్రెస్ పార్టీతో పోటాపోటీగా విజయం సాధించింది. మండలంలో 25 గ్రామపంచాయతీలకు 5 ఏకగ్రీవం కాగా 20 పంచాయితీలకు గురువారం జరిగిన ఎన్నికల అనంతరం వెలువడిన ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 11 సర్పంచ్ స్థానాలను గెలుచుకోగా బిఆర్ఎస్ 9స్థానాలను గెలుచుకుంది. బిజెపి ఒక పంచాయితీ స్థానాన్ని గెలుచుకొని ఉనికిని చాటుకుంది. అయితే మండల కేంద్రమైన జగదేవ్‌పూర్ సర్పంచ్ స్థానాన్ని బిఆర్ఎస్ భారీ మేజార్టీతో గెలుచుకుంది.

## రెబెల్ అభ్యర్థుల హవా..!

ప్రజాపక్షం / వేలేరు : వేలేరు మండలంలోని పలు గ్రామాలలో రెబెల్ అభ్యర్థుల హవా కొనసాగుతోంది.శుక్రవారం ఎన్నికల ప్రచారం ముగిసే సరికి కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలలోని రెబెల్ అభ్యర్థుల హవానే కొనసాగుతోంది.ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలను నమ్ముకొని పనిచేసిన వారిని గుర్తించ కుండా వివిధ పార్టీలనుండి వలస వచ్చిన వారికే సర్పంచ్ అభ్యర్థులుగా గుర్తించి వారి తరుపున ప్రచారం చేయడం వలన గెలుపు కాదని మండలంలోని వివిధ గ్రామాలలో రెబెల్ అభ్యర్థులదే హవా కొనసాగుతోంది పలు గ్రామాలలో స్పష్టత కనిపిస్తోంది.శుక్రవారం మండలంలోని పీచర గ్రామానికి చెందిన మాచెర్ల కవితకనుకరాజు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి పార్టీని నమ్ముకొని సేవాధృక్పథంతో అనేక కార్యక్రమాలు చేయగా నేడు వేలేరు వ్యక్తులను ప్రోత్సహించడం సరైందికాదని అన్నారు.కార్యక్రమంలో మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి,రవిందర్,కొమురయ్య,నాగరాజు, సుధాకర్,నిఖిల్ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి చేసేదే కేంద్ర ప్రభుత్వం

బిజెపి సర్పంచ్ అభ్యర్థురాలు పద్మ

ప్రజాపక్షం/ములుగు : గ్రామాలను అభివృద్ధి చేసిందే, బిజెపి కేంద్ర ప్రభుత్వం వారి సర్పంచ్ అభ్యర్థురాలు గాజుల పద్మ అన్నారు. వెంకటాపూర్ మండలం లింగాపూర్ గ్రామంలో ప్రచారం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని ప్రతి గ్రామానికి వైకుంఠధామం డంపింగ్ యార్డ్ క్రీడ ప్రాంగణం ఇలా గ్రామాలలో అనేక పథకాలు చేపట్టి ముందుకు దూసుకుపోయిన బిజెపి కేంద్ర ప్రభుత్వం అని ఆమె అన్నారు. నన్ను గెలిపిస్తే గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తానని ఆమె అన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో తాజా మాజీలను గుర్తించి సర్పంచ్‌గా ఎన్నుకోండి

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

ప్రజాపక్షం / వేలేరు : కష్టకాలంలో కూడా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకొని అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని వేలేరు గ్రామపంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎండి సద్దాంహుస్సేన్ అత్యధిక మెజార్టీ గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలంకేంద్రంలో గల్లీగల్లీలో డిజె సౌండ్స్‌తో భారీ ర్యాలీని నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమవేశంలో మాట్లాడారు.కష్టకాలంలో కూడా కాంగ్రెస్‌లోనే ఉండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని కేసులను నిర్భంధాలను సైతం లెక్కచేయక మొక్కవోని దీక్షతో కరుడు గట్టిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ప్రజల మధ్యలో ఉండి ప్రజల కష్టసుఖాలు తెలిసిన నాయకుడిగా ఎదిగి మీగ్రామానికి సేవచేయట కొరకు ముందుకు వచ్చిన సద్దాంహుస్సేన్ రిమోట్ గుర్తుకు అతని వార్డు సభ్యులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కవ్వంపల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పాలక వర్గం



ప్రజాపక్షం/బెజ్జంకి : మండల పరిధిలోని నర్సింహుల పల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా జెట్టి రమేష్,ఉప సర్పంచ్‌గా జెట్టి శ్రీకాంత్‌లు ఏకగ్రీవం కావడంతో గ్రామ పంచాయితీ నూతన పాలక వర్గం శనివారం మానకొండూర్ ఎంఎల్ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ పాలక వర్గాన్ని అభినందించి శాలువాతో సన్మానించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.వీరి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,వార్డు సభ్యులు గ్రామస్తులు

## కడియం శ్రీహరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



ప్రజాపక్షం/లింగాలఘణపురం : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం, కడియం శ్రీహరి, సహకారంతో, మా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటానని, వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, మండలంలోని రామచంద్ర గూడెం గ్రామానికి చెందిన, సాయి రెడ్డి, అనే నేను మల్లారెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రామపంచాయతీ, ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా, పోటీచేసి, విజయం సాధించాను అన్నారు. నేను నా గ్రామ అభివృద్ధి కోసం, మళ్లీ కాంగ్రెస్ పార్టీ సర్పంచిగా కొనసాగుతానని, వారు తెలిపారు. పార్టీ నాయకులు, మళ్లీ, నన్ను పార్టీలోకి ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్లూరి శివకుమార్, మాజీ జెడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, దేవరాయ రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బస్వారాజుపల్లి బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడి సస్పెండ్

ప్రజాపక్షం/గణపురం : గణపుర మండలంలోని బసవరాజు పల్లి బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు చౌదరి రాజయ్య ను మరియు వార్డ్ మెంబర్ చౌదరి స్వప్నను పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందున మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గారి ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోతె కరుణాకర్ రెడ్డి వారిని బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, మాజీ సర్పంచ్ చెరుకు కుమారస్వామి, మార్త శ్రీనివాస్, మార్త సుధాకర్, దాసరి రాములు, భీష్మాచారి రత్నం రాజు, గట్టు రమేష్,అజ్మీరా రాజు,మధు,కవిత,పూర్ణ చందర్, అంబటి సురేష్, చింటూ నాయక్,గణేష్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## అవకాశం ఇచ్చి గెలిపించండి అభివృద్ధి చేస్తా

స్వతంత్ర అభ్యర్థి గాండ్ల యాదగిరి

ప్రజాపక్షం/కొల్చారం : కత్తెర గుర్తుకు ఓటెయ్యండి ఒక అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి అంటూ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి గాండ్ల యాదగిరి, మాజీ సర్పంచ్ గద్ద మీది నర్సిములు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని మూడో విడత ఎన్నికలు జరగనున్న మండలంలో శుక్రవారం పోతం శెట్టి పల్లి ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా ఓటర్ల నూ పలకరిస్తూ అవకాశం ఇచ్చి ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటి ప్రచారంలో వార్డు సభ్యుల అభ్యర్థులు, నాయకులు పుల బోయిన పోచయ్య, నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా...

మందపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి పన్యాల అర్చన శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ : మందపల్లి గ్రామ ప్రజలు ఓటువేసి తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని మందపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి పన్యాల అర్చన శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సర్పంచ్ అభ్యర్థి అర్చన గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తానని,మందపల్లి వాగుపై హైలెవల్ బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో నిరుపేద ఆడపిల్ల వివాహానికి పుస్తె మట్టెలు,చీర సారె అందిస్తానని హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని,శ్రీరామ నవమికి ఊరేగింపు రథం ఏర్పాటు చేస్తానని తెలిపారు. మందపల్లి గ్రామ అభివృద్ధికి కోసం ప్రజలు గెలించాలని కోరారు.

## మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

ప్రజాపక్షం/బెజ్జంకి : మండలంలో ఈ నెల 14న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సంధర్భంగా శనివారం మండల పరిధిలోని గుండారం,వడ్లూర్,బేగంపేట,బెజ్జంకి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి తహశీల్దార్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు.అనంతరం ఎన్నికల సిబ్బందికి తగు సలహాలు సూచనలు తెలియజేశారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్సై అశోక్

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని లోకేశ్వరం ఎస్సై అశోక్ అన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద 100 నుంచి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని,ప్రజలు గుంపులుగా గుమిగూడకూడదని సూచించారు.పోలింగ్ కేంద్రాల లోపల మొబైల్ ఫోన్లు,నీటి సీసాలు,మసి సీసాలు, పెన్నులు, ఆయుధాలు వంటి వస్తువులకు అనుమతి ఉండదని తెలిపారు.క్యూ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒకటి గంట వరకు ఓటర్లకు ప్రవేశం ఉంటుందని చెప్పారు.సామాజిక మాధ్యమాలలో రెచ్చగొట్టే లేదా గొడవలకు దారి తీసే సందేశాలు పంపిణ వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఎవరైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.ఎన్నికల అనంతరం అదే రోజు విజయోత్సవ ర్యాలీలు,టపాకాయల పేలుళ్లు చేయరాదని,సంబంధిత అధికారుల అనుమతితో నిర్ణయించిన రోజు మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు పోలీసులు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుండి ఎస్సై అశోక్ పేర్కొన్నారు.



# సర్పంచ్ నవీన్ యాదవ్‌ను సన్మానించిన జాన్సన్ నాయక్

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కుల నవీన్ యాదవ్‌కు శుక్రవారం బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ శాలువాతో సన్మానించారు.



మొదటి విడత స్థానిక ఎన్నికల్లో భాగంగా బీర్నంది గ్రామ సర్పంచ్ గా గురువారం జక్కుల నవీన్ యాదవ్ విజయం సాధించారు.ఉప సర్పంచ్ గా రాగుల రాకేష్ ఎన్నుకోగా సర్పంచ్,ఉప సర్పంచ్ శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ ను ఖానాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జాన్సన్ నాయక్ సర్పంచ్, ఉప సర్పంచ్ లకు అభినందనలు తెలిపి ,శాలువాతో సన్మానించారు.ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు.

## మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / చెన్నూరు :** ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన చెన్నూర్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువలో వేగవంతమైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం ఈ ఆసుపత్రిని నిర్మిస్తోందని తెలిపారు. గుత్తేదారులతో సమన్వయం చేసుకుంటూ, నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేలా అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి, ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మామడ,లక్ష్మణచందా మండల నూతన ఎన్నికైన సర్పంచులకు సన్మానం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల నమ్మకానికి సర్పంచ్ ఫలితాలు నిదర్శనంగా నిలిచాయని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరిరావు అన్నారు.మొదటి విడత సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన మామడ,లక్ష్మణచందా,మండలం లోని సర్పంచులను జిల్లా కేంద్రం లోని ఆయన నివాసంలో శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందించారు.మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే విజయం సాధించారని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల ప్రజాపాలన సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని అన్నారు. పల్లి సర్పంచ్ సోనియాసంతోష్,గోల్డ్ కూడా మూతి బాయ్,అనంతపేట తిరుమల్,కిషన్‌రావు పేట వసంతరావు,న్యూలింగంపల్లి సర్పంచ్ బీమా గంగన్న,రాయదారి సర్పంచ్ బంక తిరుపతి,వడ్యాల్ సర్పంచ్ పసుపుల నరేష్ లను శాలువా తో మాజీ జెడ్పిటిసి మంగ్యా నాయక్ తదితరులున్మానించారు.వివిధ మండల పార్టీ అధ్యక్షుడు వడ్నాల రాజేశ్వర్ మాజీ ఎంపీపీ నరేష్ రెడ్డి,కమలాకర్ రావు, సంతోష్ రాథోడ్,మాజీ జెడ్పిటిసి మంగ్యా నాయక్ పాల్గొన్నారు.





## వాహనాల తనిఖీ చేసిన ఎఫ్.ఎస్.టి టీం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మండల కేంద్రంలోని ఎఫ్.ఎస్.టి,పోలీస్ సిబ్బంది సర్పంచ్ ఎలక్షన్ సందర్భంగా కాండ్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఫ్.ఎస్.టి టీమ్ మాట్లాడుతూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ మద్యం,డబ్బులు తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలిపారు.రాథోడ్ సురేష్,రాజేశ్వర్,శంసున్ పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ముస్లిం కమిటీ సన్మానం



**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన మహమ్మద్ నయీమ్‌తో పాటు వార్డు సభ్యులను జామా మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు నూతన ప్రజా ప్రతినిధులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. తమపై నమ్మకంతో ప్రజలు తమను గెలిపించినందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ మహమ్మద్ నయీమ్, వార్డు సభ్యులు మహమ్మద్ అథర్, అక్తరీ బేగం, నాగేందర్ మరియు ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

## ఎమ్మెల్యే కోవ లక్ష్మి దిశానిర్దేశం

**ప్రజాపక్షం / రెబ్బెన :** రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెబ్బన మండలం గోలేటి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బిఆర్ఎస్ నాయకుడు అజ్మీరా బాబురావును, వార్డు సభ్యులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. గోలేటి లోని టిబిజికెఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కోవ లక్ష్మి మాట్లాడుతూ గోలేటి గ్రామ సమగ్రాభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల విజయం అత్యవసరమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని సూచించారు. కార్యకర్తల కృషి, అంకిత భావంపై తనకు నమ్మకం ఉందని, అజ్మీరా బాబురావుతో పాటు వార్డు సభ్యులందరూ కచ్చితంగా భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ధీమాను ఆమె వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెబ్బన బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పోటు శ్రీధర్ రెడ్డి, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు, నాయకులు వెంకటేశ్వర్లు, కిరణ్, మాజీ సర్పంచులు తోట లక్ష్మణ్, సుమలత, నాయకులు పంబల శ్రీనివాస్, అసిఫ్ అలీ, వెంకటస్వామి, దయాకర్, కుమారి, మల్లేష్, లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



# జన్నారం నూతన సర్పంచ్‌గా కళావతి నందు నాయక్

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం గ్రామ పంచాయతీలో జరిగిన మొదటి విడత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థి కళావతి నందు నాయక్ విజయం సాధించారు. ఆమె తన సమీప ప్రత్యర్థులపై గెలుపొంది జన్నారం నూతన సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళావతి నందు నాయక్ మాట్లాడుతూ జన్నారం గ్రామాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని స్పష్టం చేశారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని పేర్కొన్నారు.



# బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్‌గా బండారి సూరిబాబు

**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు మందమర్రి పట్టణ బిఆర్ఎస్ కమిటీ సెక్రటరీ జనరల్‌గా బండారి సూరి బాబు నియమితులయ్యారు. పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు జె. రవీందర్, సీనియర్ నాయకులు, టిబిజికెఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఇతర యూనియన్ నాయకులు సూరిబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సూరిబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజలకు మరింత చేరువయ్యేలా సేవలు అందిస్తానని తెలిపారు. నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు.

# నస్పూర్‌లో ఉత్సాహంగా మహిళలు, పిల్లల క్రీడా పోటీలు

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని సిఇఆర్ క్లబ్‌లో మహిళలు, పిల్లల కోసం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రో బాల్ పోటీలను, పిల్లలకు 50 మీటర్ల రన్నింగ్ రేసులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు ముని గంటి ఉమారాణి శ్రీనివాస్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఇంత ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం ఎంతో ఆనందకరమన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నస్పూర్, శ్రీరాంపూర్ కాలనీల్లో మహిళలు, పిల్లల కోసం మరిన్ని ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 23వ తేదీన జరిగే ఆవిర్భావ దినోత్సవ ప్రధాన కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీనియర్ పిఓ ఎస్. సురేందర్, ఏఐటియుసి నాయకులు కొట్టే కిషన్ రావు, స్పోర్ట్స్ సూపర్వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య, ఇండోర్ కెప్టెన్ సురేష్, సేవా సెక్రటరీ జ్యోతి, సభ్యులు శారద, సునీత, రజిత, శిక్షకులు, అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.